క్లుప్తంగా

మాజీ మంత్రి కాసు జన్మదిన వేడుకలు



నరసరావుపేట: మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతోపాటు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకుడు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, కాసు అభిమానులు స్వయంగా ఆయనను కలిసి దుశ్సాలువ కప్పి పూలదండలు వేసి కేక్‌లు కట్‌చేయించి శుభాకాంక్షలు తెలియచేశారు. శుభాకాంక్షలు తెలియచేసిన వారిలో నాయకులు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, తన్నీరు శ్రీనివాసరావు, ఎన్.సురేంద్ర, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, షేక్ కరిముల్లా, పచ్చవ రవీంద్ర, కపలవాయి శివప్రసాదు, పొట్టి ఆంజనేయులు, డి.రామకృష్ణ, 157 కరిముల్లా, షేక్ ఫరీదు తదితరులు ఉన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

యడ్లపాడు: మండలంలోని దింతెనపాడు గ్రామం పరిధిలోని ఎస్సీ కాలనీ సమీపం పంటపొలాల్లో పేకాట ఆడుతున్నరని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ టి.శివరామకృష్ణ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విప్లవ యోధుడు భగత్‌సింగ్




చిలకలూరిపేట: యువతలో స్వాతంత్ర్యకాంక్ష రేపిన విప్లవయోధుడు సర్దార్ భగత్‌సింగ్ అని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని చెప్పారు. అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత, స్వేచ్ఛకోసం భగత్‌సింగ్ ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. ప్రస్తుతం దేశంలో స్వాతంత్ర్య సమరయోధుల కలలను కల్లలు చేసే పాలన కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజాన్ని కులమతాలుగా విడగొట్టేందుకు జరుగుతున్న కుటిల యత్నాలను అడ్డుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి బొంతా ధనరాజ్, గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్, ఏఐవైఎఫ్ నాయకులు కె.మల్లిఖార్జున్, బి.రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: భారత స్వాతంత్ర ఉద్యమకారుడు సర్దార్ భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అవ్వారి భవన్నారాయణ భవన్‌లో జరిగిన వేడుకల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావులు మాట్లాడుతూ భారత ప్రభుత్వం సర్దార్ భగత్‌పేరుతో సమగ్రమైన జాతీయ యువజన(భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్) విధానాన్ని తీసుకురావాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు రొడ్డా అంజిరెడ్డి, వెన్న శ్రీనివాసరెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



దాచేపల్లి: యువత సన్మార్గంలో నడవాలని పాస్టర్ గనుపల్లి శ్యాం ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి, దాచేపల్లి దక్షిణగడ్డ లూథరన్ చర్చిల్లో యువజనుల ఆదివారం ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. యవ్వనప్రాయంలో యువత నడకని సరిచేసుకోవాలని, చెడుమార్గాల్లో కాకుండా మంచి మార్గంలో నడిస్తే జీవితంలో ఉన్నతమైన స్థానాల్లో ఉండవచ్చునన్నారు. చెడు మార్గాల ఆకర్షణకు బానిసలు కాకుండా ఉండాలని, దైవచింతన ద్వారా మంచి మార్గంలో నడవవచ్చునని ఆయన చెప్పారు. యువజనుల ఆదివారం ఆరాధనల్లో యువతీ, యువకులు గీతాలను ఆలపించారు. క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన యువతకి బహుమతులు అందజేశారు. పాస్టర్ జయపాల్, మాచర్లకి చెందిన యాక్స్‌మస్ జాను, సీబీటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఎం.జాస్మిన్ దైవసందేశం అందించారు.

కార్యకర్తలకు అండగా 'డిజిటల్ బుక్'

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా, పార్టీ నాయకులు

వినుకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడిందని.. అటువంటి అక్రమాలను నిలువరించేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చారని, వినుకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆయన ఆవిష్కరించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న రీతిలో తీసుకొచ్చిన డిజిటల్ బుక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. అనంతరం మాట్లాడు తూ రాష్ట్రంలో ఎక్కడ మారుమూల ప్రాంతంలో కార్యకర్తలకు అన్యాయం జరిగినా క్యూఆర్ కోడ్ ద్వారా దురాగతాలను తెలియజేయవచ్చని ఆధారాలతో తెలియజేస్తే రాను న్న రోజుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డిజిటల్ బుక్ సేవలను సద్వినియోగించుకొని కూటమి సర్కారు చేస్తున్న అరాచకాలను తెలియజేయాలని కోరారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దురహంకారానికి వేదికగా అసెంబ్లీని మార్చారు..

రాష్ట్ర అసెంబ్లీని అహంకారానికి, అధికార దాహానికి వేదికగా చేసుకొని సభ్యులు ప్రవర్తించిన తీరు దారుణమని మాజీ ఎమ్మెల్యే బొలలో బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభా మర్యాదలను కాపాడాల్సిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఏం చేస్తున్నారని మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవీ సభ్యులు మాట్లాడే భాషను కంట్రోల్ చేయలేకపోతున్నారన్నారు. ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు స్వగ్రామం ఇనిమెళ్ల గ్రామంలో 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురయిందని, ఆయన అనుచరులతో పాటు ఎమ్మెల్యేకు కూడా ఈ కబ్జాలో భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. నియోజకవర్గంలో టీడీపీ నేతలు రేషన్ బియ్యం, అక్రమ మద్యం, అక్రమ మట్టి, ఇసుక రవాణా, వంటి చర్యలతో బరి తెగిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం హయాంలో నిర్మించిన గ్రామ సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, ఆర్బీకేలు నేడు అలంకార ప్రాయంగా మారాయన్నారు. తమ ప్రభుత్వ ఆలయంలో 17 మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేస్తే అవి నిర్వహించలేక ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సిగ్గుచేటన్నారు.

కార్యకర్తల భవిష్యత్తుకు భరోసా

- ప్రతి అన్యాయాన్ని రికార్డు చేద్దాం
- డిజిటల్ బుక్ క్యూ ఆర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి విడదల రజిని



పార్టీ నాయకులతో కలసి డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ ద్వారా కార్యకర్తలకు తగు న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి నివాసంలో వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ యాప్‌ను ఆదివారం పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్యాయాలు, వేధింపులు, కక్ష సాధింపు చర్యలు, తప్పుడు కేసులకు సమాధానంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రారంభించారని చెప్పారు. ఈ యాప్ ద్వారా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్యాయాలను రికార్డు చేయవచ్చొన్నారు. ఎక్కడైనా పోలీసులు లేదా ఇతర పార్టీ నాయకులు వేధిస్తే వెంటనే ఫిర్యాదు నమోదు చేయవచ్చన్నారు. ఫొటోలు, వీడియోలు, ఇతర ఆధారాలను నేరుగా అప్‌లోడ్ చేయవచ్చన్నారు. ఇంటర్నెట్ లేని పరిస్థితుల్లో కూడా ఫోన్ కాల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యకర్తలకు భరోసా, ప్రతి అన్యాయానికి సాక్ష్యం, భవిష్యత్తులో న్యాయం చేసేందుకు ఆధారంగా డిజిటల్ బుక్ నిలుస్తుందన్నారు. ప్రతి కార్యకర్త వెనుక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారనే విశ్వాసం డిజిటల్ బుక్ కల్పిస్తుందన్నారు. ఇకపై ప్రతి అన్యాయాన్ని డిజిటల్ రికార్డు చేద్దామని, ప్రజల, కార్యకర్తల రక్షణ కోసం పోరాటం చేద్దామని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల అధ్యక్షులు షేక్ దరియావలి, దేవినేని శంకరరావు, మంగు ఏడు కొండలు, వడ్డేపల్లి నరసింహరావు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు కుప్పాల ప్రభుదాసునాయుడు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఏకాంబరపు సునీత, ఇంటిలెక్చువల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు తాళ్ల అంజిరెడ్డి, నాయకులు కొచ్చెర్ల కిషోర్, సింగారెడ్డి కోటిరెడ్డి, మద్దూరి కోటిరెడ్డి, రాచమంటి చింతారావు, ఉడుత వెంకటేశ్వరరావు, అప్పాపురం షేక్ రమేష్‌బాబు, దాసరి అంజలి, సాపా సైదావలి, పఠాన్ తలహాఖాన్, బండారు జయకుమార్, తియ్యగూర అంజిరెడ్డి, మైలా రాజేష్, డీలర్ సుభాని, మానుకొండ శేషిరెడ్డి పాల్గొన్నారు.



నరసరావుపేటలో అన్నపూర్ణదేవి అలంకారం



నీలంపాటి అమ్మవారి దేవాలయంలో ..



లింగారావుపాలెంలో శ్రీకాళికాదేవిగా..



చిలకలూరిపేటలో గాయత్రీదేవిగా..



విప్పర్లలో మహాచండీదేవిగా..



గణపవరంలో కాళికాదేవిగా..

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాల్లో చేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– నరసరావుపేట ఈస్ట్ / నాదెండ్ల /శావల్యాపురం/యడ్లపాడు /చిలకలూరిపేట/ రొంపిచర్ల

అధ్వానంగా క్రైస్తవ సమాధుల తోట

- మందుబాబులు ,పేకాట రాయుళ్లకు నిలయం
- పారిశుధ్య నిర్వహణను పట్టించుకోని మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యే
- 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట'లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



సమాధులతోటలో మురుగుతో పాచి పట్టిన సీసీ రోడ్లను పరిశీలిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి



మురుగు మధ్యే బల్లలు

నరసరావుపేట: స్థానిక క్రిస్టియన్‌పాలెం వెనుక ఉన్న ఎస్సీ సోదరుల క్రైస్తవ సమాధుల తోటలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని, మున్సిపల్ అధికారులు, శాసనసభ్యులుగాని పట్టించుకోవట్లేదని, వచ్చే ఆదివారంలోగా అక్కడ పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోతే తామే పార్టీ తరఫున సొంత నిధులతో శ్రమదానం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని పలు ప్రదేశాలకు ద్విచక్రవాహనాలపై పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలించారు. క్రైస్తవ సోదరులకు చెందిన సమాధులతోటకు వెళ్లేదారిలో పెద్దగుట్టలుగా చెత్తచేరి తీవ్ర దుర్గంధం రావటాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తంచేశారు. మృతదేహాలను చివరి ఘడియల్లో సమాధికోసం తీసుకెళ్లే దారిలో ఇటువంటి పరిస్థితులు ఉండటం దారుణమని పేర్కొన్నారు. సమాధుల తోటలోని సిమెంట్ రోడ్లపై మురుగునీరు నిలిచిపోయి పరిసర ప్రాంతాలు అన్నీ పాచి పట్టిఉండటాన్ని గమనించారు. పక్కనే ఉన్న ఖాళీస్థలం నుంచి మురుగునీరు లీకై కొన్ని నెలల నుంచి ఈ రోడ్లపై ప్రవహిస్తుండటంతో ఈ పరిస్థితికి కారణమని గుర్తించారు. సిలువ చుట్టూ పందికొక్కుల పడిఉండటంతో అక్కడ తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటాన్ని గమనించారు. అలాగే మద్యం సీసాలు కూడా పడి కన్పించాయి.

● డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు తమ పెద్దల సమాధులను ఇక్కడ నిర్మించుకుని గౌరవప్రదంగా పరలోకానికి చేరిన తమ పెద్దలను తలుచుకొని ఈస్టర్ పండుగనాడు ప్రార్థనలు చేస్తారన్నారు. అటువంటి ప్రదేశం బాగు గురించి మున్సిపల్ అధికారులు, శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు గాని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాత్రిపూట మందుబాబులు ఇక్కడే తాగి, పేకాట ఆడుతూ ఖాళీ మందు సీసాలు అక్కడే పడేస్తున్నారని, సమాధుల తోటను పేకాటకు నిలయంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గత తమ ప్రభుత్వ హయాంలో సమాధుల తోటలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి మంచినీటి టాపులు, బోర్లు ఏర్పాటు చేశామని, ఒక పోలీసు అధికారి చేత ఇక్కడ ప్రతిరోజు రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకున్నామని గుర్తుచేశారు. ప్రస్తుతం సెంట్రల్ లైటింగ్ పనిచేయడం లేదని, ట్యాపుల ద్వారా మంచినీటి చుక్క కూడా రావట్లేదని, బోర్లు అక్కడక్కడ పనిచేస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కళ్లు తెరిచి సమాధుల తోటలో పారిశుధ్య పనులు చేయించాలని, సెంట్రల్ లైటింగ్ బాగు చేయాలని, ట్యాపుల ద్వారా మంచి నీరు సరఫరా చేయించాలని, బోర్లు బాగు చేయించాలని డిమాండ్ చేశారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కందుల ఎజ్రా, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షుడు నిడమానూరి సురేంద్ర, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ బూదాల కల్యాణ్, ఎస్సీ సెల్ పట్టణ కార్యదర్శి కుక్కల పోలయ్య, బీసీసెల్ పట్టణ అధ్యక్షులు మత్రిపూడి రాంబాబు, మైనార్టీసెల్ పట్టణ కార్యదర్శి షేక్ శిలార్‌బాష, గంటినపాటి గాబ్రియేలు, సుబ్రమణ్యం నాయీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వనరుడు గుర్రం జాషువా

- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ఘనంగా జాషువా జయంతి వేడుకలు



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా తదితరులు

వినుకొండ: వినుకొండ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన విశ్వనరుడు గుర్రం జాషువా అని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా బొల్లా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కష్టాలను తన రచనల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన గుర్రం జాషువా వినుకొండ ప్రాంతవాసి కావడం గర్వకారణమన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగించారని, పేదల అభివృద్ధి కోసం సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు.

ఆయన ఆశలకు అనుగుణంగా కార్యకర్తలు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎంఎన్ ప్రసాదు, పంచాయతీరాజ్ విభాగం నేత వెంకట్రామిరెడ్డి, ఎస్సీ సెల్ నేత కోపెల దేవరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, మండల కన్వీనర్లు ముప్పరాజ వెంకటేశ్వర్లు, కొండా వర్జుగేశ్వరరావు, దండు చెన్నయ్య, ఏడుకొండలు, పట్టణ అధ్యక్షుడు కొత్త మాస్ శివ, బూత్ కమిటీ అధ్యక్షుడు కొత్త కృష్ణారెడ్డి, తలారి ఆంజనేయులు, రమణారెడ్డి, నాగిరెడ్డి, మహిళా నాయకులు చిన్నమ్మాయి, దుర్గా, విజయ, రవణమ్మ పాల్గొన్నారు

శ్రీకృష్ణ యాదవ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

చిలకలూరిపేట: సమాజ చైతన్యం కోసం పాటుపడిన మహాకవి గుర్రం జాషువా అని శ్రీకృష్ణ యాదవ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గోరంట్ల నారాయణ యాదవ్ చెప్పారు. మహాకవి గుర్రం జాషువా వర్ధంతిని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలోని అసమానతలపై తన కవితల ద్వారా జాషువా పోరాటం చేశారని గుర్తు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గోలి భానుప్రకాశ్, నర్రా నాగరాజు, కొమ్మనబోయిన రాంబాబు, పోటు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో..

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట శాఖ గ్రంథాలయంలో కవి కోకిల గుర్రం జాషువా జయంతి కార్యక్రమం శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ అధ్యక్షతన పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి నిర్వహించారు. గుర్రం జాషువా విశ్వనరుడునని ప్రకటించి తన కవిత్వం సమన్వయం చేయుటకు ఆర్ద్ర హృదయం కూడా అవసరమని చెప్పారన్నారు. అన్ని వర్గాల ప్రజలు జరుపుకొనే ఒకే ఒక్క కవి జయంతి జాషువా జన్మదినం అని అన్నారు. గాయకులు రంజిత్‌కుమార్ జాషువా పద్యాలను ఆలపించారు. నూమిస్ మాటిస్ట్ మామిళ్ళ కృష్ణయ్య, స్కౌటు మాస్టారు పమ్మి వెంకటరెడ్డి, అమ్మ జిలాని, గణితం ఉపాధ్యాయులు రెడ్డి జాలయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు పీవీఎస్ఆర్ ప్రసాదరావు, కే.వీరబ్రహ్మాచారి, పిన్నింటి వీరబ్రహ్మం, సంఘ సేవకులు కే.చంద్రపాల్, సీనియర్ న్యాయవాది ఆరోగ్యం చౌదరి, పోస్టల్ మేనేజర్ మురళి పాల్గొన్నారు.

నవయుగ కవి చక్రవర్తి జాషువా..

వినుకొండ: తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువా సరికొత్త ఒరవడి సృష్టించి, నవయుగ కవి చక్రవర్తిగా పేరుగడించారని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ అన్నారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిరదౌసి, గబ్బిలం, క్రీస్తుచరిత్ర లాంటి అనేక ప్రతిష్టాత్మకమైన రచనలు చేసిన జాషువా అనేక పురస్కారాలు, బిరుదులు పొందారన్నారు. సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఎ.పవన్‌కుమార్, కె.మల్లికార్జునరావు, దారివేముల మరియబాబు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు హనుమంతరెడ్డి, సీపీఎం వినుకొండ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన మహాకవి, కవికోకిల గుర్రం జాషువా వినుకొండవారు కావడం గర్వకారణమన్నారు. నాయకులు శివరామకృష్ణ, వెంకటప్పయ్య, రామకృష్ణ, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

నరసరావుపేట: మహాకవి, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలను మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య మాదిగ ఆధ్వర్యంలో పల్నాడు బస్టాండ్‌లోని జాషువా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు గుండాల ప్రభుదాసు, వినుకొండ, నరసరావుపేట నియోజకవర్గాల అధ్యక్షులు సురభి కోటేశ్వరరావు మాదిగ, గరినపూడి ప్రశాంతి, ఈపూరు మండల అధ్యక్షుడు ముప్పాళ్ళ పెద్ద గురవయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేబిస్‌పై అవగాహన

వినుకొండ: రేబిస్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వినుకొండ ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.శ్రీరాములు తెలిపారు. అంతర్జాతీయ రేబిస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వినుకొండ ప్రాంతీయ పశువైద్యశాలలో ఆదివారం 38 పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు

రొంపిచర్ల: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం నరసరావుపేట రోటరీ క్లబ్, శంకర కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 150 మందికి ఆపరేషన్‌లు అవసరమని నిర్ధారించారు. అవసరమైన మందులను అందజేశారు. రొంపిచర్ల సర్పంచ్ చక్రారెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ గాయత్రి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, రాంబాబు, మునీంద్రరెడ్డి, లింగ ఆంజనేయులు పాల్గొన్నారు.

మహనీయులను మరిచారు!



ఆవిష్కరణకు నోచుకోని విగ్రహాలు

నూజెండ్ల: ఒకరేమో సత్యం, అహింస మార్గాల ద్వారా తన జీవితాన్ని ధారపోసి స్వాతంత్ర్యం తెచ్చిన జాతిపిత మహాత్మాగాంధీజీ.. మరొకరు ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం ప్రత్యేక రాష్ట్ర సాధనలో భాగంగా 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు.. మండల కేంద్రంలోని ఈ మహనీయుల విగ్రహాలకు ఆలనాపాలనా కరువైంది. మండల స్థాయి అధికారులు నిత్యం ఇక్కడే ఉపన్యాసాలు ఇస్తుంటారు కూడా... అయినా సరే సంవత్సరాలుగా నిరాధరణకు గురి అవుతున్నాయి... వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రమైన నూజెండ్లలో ఓ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు విరాళాలతో గాంధీజీ, పొట్టి శ్రీరాముల విగ్రహాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గ్రామస్తుల సహకారంతో శంకుస్థాపన కార్యక్రమం పూర్తి చేశారు. పనులు పూర్తి చేసి విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఇది జరిగి ఏడు సంవత్సరాలు గడిచినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. కాలం గడిచే కొద్దీ రంగు వెలిసి విగ్రహాలు రూపురేఖలు కోల్పోతున్నాయి. మహనీయుల విగ్రహాలను అలా నిర్లక్ష్యంగా వదిలేయకుండా అధికారులు ముందుకు వచ్చి రాబోయే గాంధీ జయంతి నాటికైనా బాగు చేయించి, ప్రారంభింపజేయాలని పలువురు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ, కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట: పట్టణ పౌరులు అందరూ ప్లాస్టిక్ వాడకాన్ని విరమించి పర్యావరణ బాగు కోసం కృషిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. సెయింట్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్, డాక్టర్ అబ్దుల్ సలాం సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ, స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పురపాలక కార్యాలయం నుంచి మల్లమ్మసెంటర్ వరకు ప్లాస్టిక్ వద్దు – గుడ్డ సంచులు ముద్దు అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీని ప్రారంభించి తాను ఆ ర్యాలీలో కొనసాగారు. మున్సిపల్ కమిషనర్ యం.జస్వంతరావు పౌరులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఎన్‌జీఓ ప్రతినిధులు వంకాయలపాటి రవి, కృష్ణకుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ పర్యావరణ కార్యదర్శులు, పోలీసులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.